పోయిన సొమ్ము

కొడవటిగంటి కుటుంబరావు

"అబ్బాయ్? ఓ రబ్బాయ్! నాయనా ఓ ర్నాయనా!......ఇంతలో ఎక్కడికి పోయినాడే?

"కాక పోయినా ఒళ్లు బరువు కాదులే? పనీ పాటూ లేదు కదా! మూడేళ్ల వుంకను కని పెట్టుకుని వుండ లేక, పోతే—— ——నా పోలికే వచ్చి వున్నట్టయితే ఈ పాటికి ఆరుగురు బిడ్డల తల్లివి కావలిసిన దానివి!——నీ వంటి వాళ్లు సంసారాలు ఏమి ఈదు తారే తల్లీ!"

"అబ్బ: ఒక్కడు——చాలేద్దూ, అమ్మా! వేగ లేకుండ ఉన్నానూ!...ఆ బావి దగ్గిరికే పరిగెత్తాడో—— ఏం కర్మమో! రామ రామా! ఒక్క నిమిషం కాలు నిలవదు కదా! ఎక్కడి మైరావణ సంతతో!——"

"చేసు కున్న వారికి...పో, వెళ్లి మాపూ! నీ కింత ఒళ్లు బరువయిందేమే? నిన్ను నీ అత్తగారూ, మొగుడూ చెడ గొడు తున్నారు లేవే!..."

"అడగ నక్కర లేదు!" అంటూ సోమమ్మ లేచి సావిడిలోకి వచ్చేటప్పటి కల్లా కింది పెదిమ పయి వరస పళ్లతో బిగ పట్టి రెండు చేతులూ మండిగం మీద ఆనించి వుపాయంగా గడప దాటుతున్న కృష్ణుడు ప్రత్యక్ష మయినాడు.

పిల్లవాడు కనిపించిన సంతోషం రెండు క్షణాలు కూడా వుండలేదు. పిల్లవాడి మొహంలో ఏదో వెల్తి సోమమ్మకు తోచింది. ఏమిటూ అది అని ఆలోచన పోయింది. ఈ ఆలోచన కూడా ఎంతో సేపుండ లేదు.



ఇంట్లో పొయ్యిమీద ఎసరు ఎక్కించ బోతున్న తల్లి ఉలిక్కి పడి చేతులో నించి గిన్నె జారి పడ వేసేటంత పెద బొబ్బ పెట్టింది సోమమ్మ——"ఓరి వెధవా గోలు సేదిరా?"

పిల్ల వాడి మెళ్లో వున్న పులిగోరూ గొలుసూ మంత్రించి నట్టు మాయ మయినవి.

"ఏం గొలుసే" అంటూ తల్లి కూడా సావిట్లోకి వచ్చింది.

"పులి గోరే! గొలుసే" అంది సోమమ్మ తెల్ల మొహం వేసి.

"తలంటి పోసి గొలుసు పెట్టావుటే?"

"అయ్యో—పెట్టానే"

"ఏంరా, నాన్నా? గొలుసేదిరా?"

అమ్మమ్మ చంకనెక్కి కృష్ణుడు "అమ్మ—మ్మ—మ్మ......" అని ప్రారంభించాడు.

"సీల వూడి గొలుసెక్కడయినా జారి పడ్డదేమో నే!" అంటూ సోమమ్మ దొడ్డి చుట్టూ తిరిగి వచ్చింది. ఎక్కడా గొలుసు జాడాలేదు. పచ్చగా కన పడ్డ దల్లా గడ్డి పరక గానే పరిణమించింది.

"అయ్యయ్యో! పాపిష్టి సొమ్మే!" అంది సోమమ్మ నిలువునా కంపిస్తూ, ఆ పాపిష్టి సొమ్ము కోసం ఆమె పడుతున్న తహ తహ చూస్తే ఎంత మంద మతి కయినా ఆశ్చర్యము వేస్తుంది.

"వాకిట్లోకి వెళ్లాడేమో" అంది తల్లి. అనే అనడం తోటే సోమమ్మ వాకిట్లోకి పరిగెత్తింది, కూతుర్ని అనుసరించింది తల్లి.

వీధిలో "వాళ్ల" రాముడు ఆడు కుంటున్నాడు.

"ఏంరా. రాముడూ, మా పిల్లవాడు వాకిట్లోకి వచ్చాడా" అంది సోమమ్మ.

"ఆ వచ్చాడండి" అన్నాడు కళ్లు పెద్దవి చేసి. వాడి వాలకం చూస్తే యీ రహస్యం ఎవరు ముందడుగుతారా చెప్పేద్దామను కున్నట్టుంది.

ఈ కాస్త ముక్కా చెప్పేసి పెద్ద బరువు తన మీద నించి తీసేసు కున్న వాడల్లే రాముడు రెండు పెదిమలూ లోపలికీ నాలిక బయటికీ పోనిచ్చి బొంగరానికి జాగ్రత్తగా తాడు చుట్టడం మొదలు పెట్టాడు.

"ఎంత సేపయిందిరా—రాముడూ"

నాలిక లోపలికి పోయింది. పెదిమలు పయికి వచ్చినయి: కనిబొమలు పయికి పోయినయి. "ఏమిటండీ" అన్నాడు.

"మా కిష్టుడు బయటికి వచ్చి ఎంత సేపయినది?"

"ఇప్పుడే నండీ! ఎనిమిది గంట లప్పుడు" మళ్లా కని బొమలు యథాస్థానానికి వచ్చేసినయి. కళ్ల సయిజు కూడా తగ్గి పోయింది. పెదిమలు లోపలికి వెళ్లినయి. నాలిక బయటికి వచ్చేసింది. బొంగరం విసరివేయడానికి తయారవు తున్నాడు.

అప్పుడు దాదాపు పదకొండు గంటలు కావడం వల్ల రాముడు చెప్పిం దంతా సోమమ్మకు గానీ తల్లికి గానీ ఎందుకూ పనికి రాలేదు. తల్లీ కూతురూ మొహా మొహాలు చూసు కున్నారు.

"ఇంతకూ మనకు ప్రాప్తం లేదు! నీకు బుద్ధి లేదు లేవే! ఇదేం మీవూరా: ఎక్కడ పారవేసిన వస్తు వక్కడ వుండ డానికి? బస్తీలో పిల్లలకు నగలూ నాణ్యాలూ పెట్టడానికి వుందా? ఇంకా పిల్ల వాణ్ణి నిలువునా ప్రాణం తియ్యలేదు. బిడ్డయినా దక్కాడని సంతోషించక ఏడుస్తా వెందుకు? పద!"

సోమమ్మకు దుఃఖం ఆగ లేదు.

"అది పెట్టడం మరిచి పోనన్నా పోలేదే! నా చేతులు కాలి పోనూ! పాపిష్టి సొమ్మే! అయ్యో—అయ్యో! అరునవరుసుల సొమ్ము ఎవరి నోట పెట్టానే!

ఇంతలో తల్లి కొక ఆలోచన తట్టింది.

"ఇదుగో—చూడమ్మాయ్! వాడున్నాడే—వాళ్ల రాముడు—వుత్త పోకిరీ వెధవ! వెనక యిట్లాగే వాళ్ల నాన్న జేబులోనుంచి అయిదు రూపాయల కాయితం కూడా యెత్తుకు పోయినాడే! నేను వెంకాయమ్మను మెల్లిగా అడిగి చూస్తానుండు......వూరుకో అమ్మా—వూరుకో! పిచ్చిదానా ఏడిస్తే వస్తుందిటే?"

"ఇప్పుడడగవే అమ్మా: యిప్పుడే అడగవే!" అంటూ రాగం తీసింది కూతురు.

"ఊఁ" అని ఒక్క ముక్క ముక్కి తల్లి లేచి "నాకు మడి బట్టన్నా ఆరలేదు" అంది.

"అయ్యో! అయిదు నవర్సుల బంగారం కన్నా ఎక్కువటే!" అంది కూతురు.

అంతా విని వెంకాయమ్మ అంతెత్తు ఎగిరి పడ్డది.

చాల్లే వమ్మా! నేర్చుకు పోయినావు. ఓడు ఓడంటే కంచం అంతా ఓడు అన్నారుట. అజ్ఞానపు కుంక తెలియక జేబులోంచి తీస్తే అప్పుడే వాళ్ల నాన్న మెక్కలు విరగ తన్నాడు. ఆరు నెలలయింది. మళ్లీ వాడు కానీ తాకి ఎరగడు. ఓహో—బాగావుందే—ఇటువంటి—చాడీలు మాత్రం తీసుకురా బోకమ్మా! ఏది పోయినా యిక మావాడి మీదే పెడతారు...చాలా బాగుంది!" అని ఆవిడ యింటిపెంకు లెగర గొట్టే టప్పటికి సోమమ్మ తల్లి దడుసుకొని ఇంట్లో వచ్చి పడ్డది.

ఇంతలోనే సోమమ్మ తండ్రి వచ్చాడు. పెళ్లామూ కూతురూ ఒక్కసారే మాట్లాడడంలో ఆయన కెంత సేపటికీ అర్థం కాలేదు. తీరా అర్థమయిన తర్వాత నయినా ఆయన ఆడవాళ్లకు ధైర్యం కలిగేటట్టు ప్రవర్తించలేదు. పెదిమలు బిగపట్టి "ఊఁ హూఁ" అన్నాడు. ఇనప పెట్టె కేసి తీక్షణంగా చూశాడు. "హూఁ!" అన్నాడు. పెళ్లాని కేసి తీవిగా "ఎవరు నీవు" అన్నట్టు చూసి "ఊఁ—హూ" అన్నాడు: క్రమంగా అంతా బోధపడి పోతున్నట్టు, అకస్మాత్తుగా లేచి బయటకు వెళ్లాడు.

ఈ చర్య ఆడవాళ్ల కర్థం కాలేదు. వాళ్లు ఎక్కువ Impress కూడా కాలేదు. అందుకు నిదర్శనంగా సోమమ్మ తల్లి వంటింట్లో నుంచి "మళ్లీ ఎక్కడికో వెళ్లారు. ఎంత సేపు కనిపెట్టుకు కూచోవాలో!" అంది.

ఒక అరగంటలో సోమమ్మ తండ్రి ఒక పోలీసును తీసుకొచ్చాడు.

"ఏమమ్మా: పోయిన వస్తు వెవరిది?" అన్నాడు పోలీసు వచ్చే రావడము తోనే.

"నాది" అంది సోమమ్మ ఆ దుర్దాగా "ఆఁ...నీ మొహం!...దానిది కాదు. దాని పిల్ల వాడిది..." అన్నాడు సోమమ్మ తండ్రి.

"అబద్ధాలు చెపితే మేము సొమ్ము పట్టివ్వ లేము... పోయిన నగను కొంచెం వర్ణించండి"

"గొలుసు—నాయనా—పులి గోరూ"

"ఎటు వంటి గొలుసు?"

"మామూలు గొలుసే—పులి గోరూ—మామూలు పులి గోరే!"

"అట్లా చెబితే చాలదు. గొలుసెంత తూకం వుంటుంది?"

"ఎనిమిది సవర్లు"

"ఇదుగో అమ్మగారూ—మీకీ సంగతులు తెలియవు. మాతో అబద్ధాలు చెబితే మీ సొమ్ము మీకు దక్కదు. ఎంత తూకం వుంటుంది?"

అయితే ఎనిమిది సవర్లని చేయించారు కామన్లు! అరిగిపోయి నాలుగన్నా ఉంటుంది."

"ఎక్కు వుంటుందా"

"ఉండ వచ్చు...ఉండదు"

"మూడు సవర్ల ఎత్తు...సరే పులిగో రంత పొడు గుంటుంది."

"రెండంగుళాలు"

"ముప్పాతిక అంగుళం...సరే. ఎప్పుడు పోయింది."

పోలీసు స్టేటు మెంటు తీసుకొని "ఏమండో పంతులు గారూ—సొమ్ము దొరికితే ఏమయినా యీనాం..." అని హెచ్చరించి వెళ్లిపోతూ ఆయన్ను బయటికి పిలిచి రహస్యంగా "మీ కెవరిమీదయినా అనుమానం వుందా?" అన్నాడు.

రహస్య

"అడిగావు కాబట్టి చెబుతున్నాను. ఎనిమిదో వార్డు ఎలెక్షన్‌లో నేను లంచాలిచ్చి నెగ్గానని కోర్టులో పిటీషన్ పెట్టి ఓడిపోయిన నాటినుంచి ఆ చలపతి రావు నామీద కారాలు—మిరియాలూ నూరుతున్నాడు... ఏమిటి వ్రాసు కొంటున్నావు?"

"ఏమీ లేదు లెండి" అంటూ పోలీసు వెళ్లి పోయినాడు.

ఆరోజు సాయంకాలమే దేవుడల్లే వచ్చింది ఒక సోదమ్మి. దాన్ని పిలిచారు. సోమమ్మ పుల్ల పడితే సోది సరిగా రాదని పూర్వానుభవం. అందుచేత తల్లే కూచుంది.

మొదట వెంకటేశ్వర స్వామి వచ్చాడు. ముడుపులూ అవీ చెల్లించుకోడమయి పోయింది. పో పొమ్మన్నది సోమమ్మ తల్లి. అప్పుడు వెంకటేశ్వర స్వామి పోయి ఎప్పుడో ఆరు నెల్లు పెరిగి పోయిన సోమమ్మ అప్ప వచ్చింది. సోమమ్మ తల్లి కంగారు పడ కుండా "నాకు నువ్వక్కర లేదు," అని చెప్పేసింది. అప్ప దసలు సంగతి వచ్చింది.

"సొమ్మొక చోట: అనుమాన మొక చోటే తల్లీ?" అంది సోదమ్మి.

"ఆఁ అదుగదీ" అంది సోమమ్మ తల్లి.

"నీ సొమ్మిట్టా?—ఇటా—ఇటా అనడుగు తుందవూ? ఇటంటే బొడ్డిటంటే గడ్డమే మాయమ్మా!" అని పాడుతూ సోదమ్మి బొట్టు పుల్లతో చూపించింది—ఆ సలది గడ్డం చూపించ బోతూంటే సోమమ్మ తల్లి బొట్టు వేపు చెయ్యి పోనిచ్చింది.

ముసి ముసి నవ్వులు నవ్వుతూ కూతురి వైపు చూసింది. "వాళ్ల రాముడే తీసేసి తల్లికిచ్చాడు సందేహము లేదు."

ఈ ముక్క సోదిలో వచ్చిన సంగతి పొద్దు గూకే లోపల వూరంతా తెలిసి పోయింది. ఆరాత్రి పన్నెండు కొట్టే వరకున్నూ పక్కింటి పెంకు లెగిరి పడుతూనే వున్నయి. సోమమ్మా—తల్లి వెంకాయమ్మను లెక్క చెయ్యలేదు. వాళ్ల కేమిటో సొమ్ము దొరికి నట్లే వుంది. "పుచ్చకాయల దొంగా అంటే బుజాలు తడువు కున్నాడుట! ఏమీ ఎరగని మనిషి తనకెందుకు?"

మర్నాడు పొద్దున సోమమ్మ తండ్రి వీధి ఆరుగు మీద కూచుని మొహం కడుక్కుంటూ వుండగా ఒక బుడబుక్కల వాడు వచ్చాడు.

"పెశ్న చెబుతను—ధొరా పెశ్న చెబుతను కోరిక ఫలిస్తది"

"ఏం ప్రశ్న చెబుతావు?"

"నీ అనుమాన మేడ వుండదో అదే నిజమయితది ధొరా"

"నా అనుమాన మెక్కడ?"

బుడబుక్కలవాడు సరిగా ఈశాన్యమూలగా చూపించాడు. భేష్! అలే వుంది. చలపతి రావుగారి యిల్లు. వాడికొక పాత వస్త్ర మిచ్చి—"ఇక లేదు పొమ్మ"ని నచ్చ చెప్పి పంపాడు సోమమ్మ తండ్రి.

పోలీసు చెప్పి ఉండడు గదా—ఎట్లా తెలిసిందో వూరంతా తెలిసింది, ఫలానాయన ఫలాని చలపతిరావు తన ఇంటో సొమ్ము యెత్తుకు పోయి నాడని పోలీసులకు రిపోర్టు చేశాడుటా అని!

రోజులు గడిచినయి. సొమ్ము సంగతేమీ తేలలేదు. పయిగా సోమమ్మ తల్లిని గురించి ఆడవాళ్లూ సోమమ్మ తండ్రిని గురించి మొగవాళ్లూ రకరకాలుగా చెప్పుకొని నవ్వు కుంటున్నారని కూడా స్పష్ట మయింది.

ఈ పాపకర్మ ఫలం యిట్లా వుండగా ఇంటో చిన్న వస్తువులు రోజు రోజు కొకటీ రెండూ చొప్పున మాయం కావడం మొదలు పెట్టినయి. ఎంత జాగర్త పడ్డా ఏమీ ఫలం లేక పోయింది. అప్పుడే వచ్చి పడుతున్న వేసం కాలము కూడా లెక్క చేయ కుండా అంతా ఇంట్లోనే పడుకుంటూ వచ్చారు—దొంగల భయము నించి.

కాని అంత జాగ్రత్త అనవసరం. ఎందు కంటే యీ దొంగతనాలు ఎవరు చేస్తున్నారో కాని కేవలమూ ఏడిపించ డానికే చేస్తున్నారు కాని ధనాశ కొద్దీకాదు . పోయిన వస్తువు లన్నీ మాశారో లేదో చాలా స్వల్ప ధరవే! చిన్న చిన్న గ్లాసులంటే, ఉద్ధరిణలంటే—అన్నీ ఇటువంటివే! ఎవరో పగకొద్దీ చేస్తున్నారు కాని మరొకటి కాదు.

ఇంతిలో ఒక రోజున పూడిక తీస్తామంటూ బావుల్లో పూడిక తీసే వాళ్లిద్దరు వచ్చారు. "బావిలో చాలా పూడిక వుంది: కింద లేదుకూడా తీయించలేదు. తీయించండి" అంది సోమమ్మ తల్లి మొగుడితో.

ఆ సందర్భంలో పోయిన సామానంతా—పులిగోరూ—గొలుసుతో సహా దొరకటం తటస్థించింది.

*   *   *   *

మూడోయేట అందరి కళ్లల్లోనూ దుమ్ము కొట్టిన కృష్ణుడు పెద్దయిన తర్వాత మాంచి గజ దొంగగా తయారయినా ఆశ్చర్యం లేదు.

భృంగామలకతైలము

మెదటికి, శరీరానికి చలువదన మిచ్చును.

1 ఔన్సు మాదిరి బుడ్డి $2\frac{1}{2}$ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజగూడు పండ్లపొడి

300 కృత్రిమర్ధకాలకి మోసపోకండి. సరాసరి వొకే ఆర్డరివ్వండి 8 అ. 6 ప్యాకెట్లు. తపాలాచార్జీ ఉచితము.

హోల్ ఏజెంట్లు: యునైటెడ్ కన్సరన్, బందరువీధి, మద్రాసు.

కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ,

రాజమండ్రి, అరవరామస్వామి అండ్ సన్సు,

బందరు, ఆనందాఫార్మసీయందును దొరుకును.

మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందఱు చదువవలసినది

ఇందు, స్త్రీ పురుషజాతులు, ఏయేజాతిస్త్రీ యేయే పురుషునికి తగినది, స్త్రీని పురుషుడెట్లు వశ పఱచుకొనుట —యింకను ఎన్నో స్త్రీ పురుషులకు ముఖ్యముగ తెలియ వలసిన విషయములు ఉన్నవి. వెల 8 అణాలు.

ది ఓరియంటల్ బుక్ డిపో

మద్రాసు